ప్రజావాణి.. 5 ఫిర్యాదులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ వి.ప్రశాంతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 5 ఫిర్యాదులు అందజేశారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 4, ఇంజనీరింగ్ విభాగానికి ఒక దరఖాస్తు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఈఈ దుర్గాప్రసాద్, ఏఎంసీ ప్రేమ్ కుమార్, ప్రాజెక్టు ఆఫీసర్ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పెంపు

పటాన్‌చెరు టౌన్: మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల ఇంటర్ ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు పటాన్‌చెరు మండలం ముత్తంగి ప్రిన్సిపాల్ నవనీత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రవేశాల గడువును ఈనెల 17వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష లేకుండానే పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లను కేటాయిస్తామన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



పటాన్‌చెరు: అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని, క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని అమీన్‌పూర్ తహసీల్దార్ వెంకటస్వామి అన్నారు. సోమవారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని సర్వే నెంబర్ 993లో అక్రమంగా నిర్మించిన మూడు ఇళ్లను తొలగించారు . అలాగే సర్వేనెంబర్.994లో ఐదు బేస్ మెట్లను తొలగించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పోలీసులు పాల్గొన్నారు.

నివాళి

పటాన్‌చెరు టౌన్: ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రామాలయం వద్ద కండర క్షీణిత వ్యాధి బాధితుల సంఘం ఆధ్వర్యంలో వీర జవాన్‌లకు నివాళులు అర్పించి, కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ మస్కులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్ (టీఎండీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ... జవాన్‌ల త్యాగాలను దేశం ఎన్నటికీ మర్చిపోదన్నారు. కార్యక్రమంలో యువ చైతన్యం ఇస్నాపూర్ దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు మహేష్ కుమార్, మణిరత్నం, సలహాదారులు వెంకన్న, శ్రీనివాస్, యువ చైతన్య కార్యవర్గ సభ్యులు జ్యోతి, సాయి, శేఖర్, సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు పరిశీలన



జలవాయువిహార్ కాలనీలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జలవాయువిహార్ కాలనీలో సుమారు 50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, జీహెచ్‌యంసీ ఇంజనీరింగ్ అధికారులు, కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వీధి కుక్కల దత్తత



కార్యక్రమంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: జీహెచ్‌యంసీ వెటర్నరీ డాక్టర్ల ఆధ్వర్యంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధి పటేల్ కుంట పార్కులో సోమవారం వీధి కుక్కల దత్తత కార్యక్రమానికి కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వాకర్స్ నాలుగు కుక్కపిల్లలను దత్తత తీసుకున్నారు.కార్యక్రమంలో సమ్మారెడ్డి, గాజుల రామారం సర్కిల్ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగార్జున, డిప్యూటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, డాక్టర్ దీపక్, మురళి, గణేష్ పాల్గొన్నారు.

27 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 27 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 9 మందికి రూ.1500 జరిమానా, మరో 17 మందికి రూ. వెయ్యి చొప్పున, మరో వ్యక్తి కి రూ . 2 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.



నాలా పనుల్లో భాగంగా తారానగర్‌లో నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్స్

చకచకా నాలా పనులు..

వరద ముంపు, డ్రైనేజీ సమస్యకు పరిష్కారం దిశగా..

నేతాజీనగర్-నల్లగండ్ల మార్కెట్ వరకు 2.4 కిలోమీటర్లు నిర్మాణం



శేరిలింగంపల్లి: వరద ముంపు, డ్రైనేజీ సమస్యకు శాశ్వతంగా చెక్ పడనుంది. నేతాజీనగర్-నల్లగండ్ల మార్కెట్ వరకు 2.4 కిలోమీటర్లు నాలా నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని నేతాజీనగర్ నుంచి నల్లగండ్ల మార్కెట్ వరకు నాలాను నిర్మిస్తే చాలా వరకు సమస్యలు తీరతాయని అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టారు. ఓపెన్ డ్రైన్ విత్ ఆర్‌సీసీ బెడ్, సైడ్‌వాల్స్ ఏర్పాటుకు రూ.28.45 కోట్ల అంచనాతో ఈ ఏడాది జనవరి 31వ తేదీన ఎమ్మెల్యే గాంధీ శంకుస్థాపన చేశారు.

- నల్లగండ్ల చెరువు అలుగు భాగం నేతాజీనగర్ నుంచి నల్లగండ్ల మార్కెట్ వరకు నాలా పొడవు 2.4 కిలోమీటర్లు



- అంచనా వ్యయం రూ.28.45 కోట్లు.. నాలా కాంక్రీట్ సైడ్ వాల్స్, బెడ్ వేయాల్సి ఉంది. 18 నెలల్లో పూర్తి చేసేలా ప్లాన్
- ఇప్పటికే తారానగర్ సాయిబాబా దేవాలయం వద్ద 180 మీటర్ల మేర పనులు పూర్తి
- నాలా 10 మీటర్ల నుంచి 14 మీటర్ల వరకు నిర్మించేలా రూపకల్పన చేశారు.

త్వరితగతిన పూర్తి చేయాలి



నూతనంగా చేపట్టిన నాలా కాంక్రీట్‌వాల్స్, బెడ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. రానున్న వర్షాకాలం కావునా అధికారులు, ప్రజాప్రతినిధులు పనుల్లో వేగం పెంచేలా చూడాల్సిన అవసరం ఉంది.

– దేవులపల్లి శ్రీనివాస్, లింగంపల్లి

సమస్య పరిష్కారం



ఈ నాలాతో సమస్యలు పరిష్కారమవుతాయి. ఎమ్మెల్యే గాంధీ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అధికారులు పనుల్లో వేగం పెరిగేలా చూస్తున్నారు. తరచూ పనులను పర్యవేక్షిస్తున్నాం.

– రాగం నాగేందర్‌యాదవ్, కార్పొరేటర్

రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయండి

జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌తో సమావేశమైన ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కోరారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌తో ఆయన సమావేశమయ్యారు. సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు, పనులు త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చెరువుల సుందరీకరణ, వీధి దీపాల నిర్వహణ, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై చర్చించారు.

పనులను వేగవంతం చేయాలి

లింకురోడ్ల పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గాంధీ జీహెచ్ఎంసీ సీసీపీ శ్రీనివాస్ దృష్టికి తీసుకొచ్చారు. సోమవారం ఆయన సీసీపీతో మాట్లాడారు. శ్రీదేవి థియేటర్ రోడ్డు విస్తరణ, జీఎన్‌టీయూ నుంచి ప్రగతినగర్ రోడ్డు విస్తరణ, ఫ్లైఓవర్, అపర్ణహిల్ నుంచి గంగారం చెరువు, హనుమాన్ టెంపుల్ ప్రధాన రహదారి వరకు, హెచ్ఎంటీ స్వర్ణపురి నుంచి పీజేఆర్ ఎన్‌క్లేవ్ వరకు, నల్లగండ్ల నుంచి శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం వరకు, మియాపూర్ నుంచి కల్వరీ టెంపుల్ మీదుగా విజ్ఞాన్ స్కూల్‌ను కలిపే లింక్ రోడ్డు, ఫ్లైఓవర్, ముంబయ్ జాతీయ రహదారి పై హోం జ్యువెల్ నుంచి రైల్వే ట్రాక్ మీదుగా శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం వరకు లింకు రోడ్డు, ఆర్‌ఓబీ పనులు త్వరితగతిన చేపట్టాలని కోరారు. సీసీపీ సానుకూలంగా స్పందించారని గాంధీ తెలిపారు. ఎమ్మెల్యే వెంట మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు రఘునందన్‌రెడ్డి ఉన్నారు.



జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌తో సమావేశమైన ఎమ్మెల్యే గాంధీ

వైద్య విభాగంలో నర్సుల పాత్ర కీలకం

హెచ్‌సీయూ ప్రొఫెసర్ డా.హబీబ్ సిద్దిఖీ

శేరిలింగంపల్లి: వైద్య విభాగంలో నర్సుల పాత్ర కీలకమైందని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రొఫెసర్ హబీబ్ సిద్దిఖీ అన్నారు. సోమవారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నైటింగేల్ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సిద్దిఖీ మాట్లాడుతూ నర్సులు సేవా మూర్తులన్నారు. నర్సింగ్ విభాగంలో ఉత్తమ సేవలు అందించిన బీహెచ్‌ఈఎల్, నిమ్స్, గచ్చిబౌలి టిమ్స్, కొండాపూర్‌లోని జిల్లా హాస్పిటల్, శేరిలింగంపల్లి, హఫీజ్‌పేట్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, ఈఎస్ఐ రామచంద్రాపురం, ఉర్దూ యూనివర్సిటీ, హెచ్‌సీయూ హెల్త్ సెంటర్స్, పటాన్‌చెరు ఏరియా హాస్పిటల్ ప్రాంతాల్లో పని చేసిన 80 మంది నర్సులను సన్మానించారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ డాక్టర్ రామన్న, సోషల్ వర్కర్ దేవానంద్, అసోసియేషన్ ప్రతినిధులు జనార్దన్, అమ్మయ్య చౌదరి, కొండల్‌రెడ్డి, బాలరాజు, విజయలక్ష్మి, నాగమణి, జీవీ రావు,



నర్సులను సన్మానిస్తున్న డా.హబీబ్ సిద్దిఖీ

సత్యనారాయణ, ప్రేమ్‌సింగ్, మల్లేష్, ఖాదర్ మొయినుద్దీన్, శివరామిరెడ్డి, పాండు తదితరులు పాల్గొన్నారు.

హఫీజ్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో..

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీజేపీ శేరిలింగంపల్లి అసెంబ్లీ మైనార్టీ మోర్చా నాయకులు ఎండీ సలీం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు బోయిని మహేష్ యాదవ్ హాజరై వైద్యులను, నర్సులను సన్మానించారు. అనంతరం ఆసుపత్రి పరిసరాలను పరిశీలించచారు. కార్యక్రమంలో వైద్యులు అనూష, బీజేపీ జిల్లా నాయకులు బాబురెడ్డి, పవన్, దేవేందర్ దాస్, రాజ్‌దీప్ పాల్గొన్నారు.



హఫీజ్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో.. ఎండీ సలీం, మహేష్ యాదవ్ తదితరులు

హైరిస్క్ గర్భధారణలు పెరుగుతున్నాయి



సురక్షిత మాతృత్వం, నవజాత శిశు ఆరోగ్యం కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లు

మాదాపూర్: హైరిస్క్ ప్రెగ్నెన్సీ ఫలితాలు డెలివరీతో ఆగవని, శిశువుకు తగిన కేర్ అవసరమని మెడికవర్ ఆస్పత్రి నియోనటాలజీ విభాగాధిపతి డాక్టర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. మాదాపూర్‌లోని మెడికవర్ ఉమెన్ ,చైల్డ్ హాస్పిటల్‌లో సోమవారం హైరిస్క్‌పై సీఎంఈ (కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్) సురక్షిత మాతృత్వం, నవజాత శిశు ఆరోగ్యంపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైరిస్క్ గర్భధారణలు పెరిగిపోతున్న నేపథ్యంలో సమయానుకూలమైన శిక్షణ, క్లినికల్ అవగాహన అవసరమన్నారు. సీఎంఈల ద్వారా వైద్య నిపుణులు నైపుణ్యాలను మెరుగుపర్చుకుని సురక్షిత వైద్యం అందించగలుగుతున్నట్టు తెలిపారు. ప్యానెల్ డిస్కషన్స్, శాస్త్రీయ సెషన్లు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు వరలక్ష్మి, మీనాక్షి, బాలాంబ, రాగారెడ్డి, సింధూరి, రాధిక, కృష్ణకుమారి, సవిత రాథోడ్, సురేంద్రప్రసాద్, ఫాగ్సి మాజీ అధ్యక్షురాలు డాక్టర్ శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు రూ.51 వేలు విరాళం



విరాళంను అందిస్తున్న విజయభాస్కర్ రెడ్డి

పటాన్‌చెరు: శంషాబాద్‌లోని సత్యం శివం సుందరం గోశాలకు పటాన్‌చెరు పట్టణానికి చెందిన విజయ భాస్కర్ రెడ్డి రూ.51 వేల విరాళంను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గో సంరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. గోశాల నిర్వహణ ఇబ్బందిగా ఉందని నిర్వాహకులు చెప్పడంతో తన వంతు సాయంగా రూ .51వేలు అందజేశామన్నారు.

బీజేపీ హైదర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడిగా అరుణ్‌కుమార్



ఆల్విన్‌కాలనీ: బీజేపీ హైదర్‌నగర్ అధ్యక్షుడుగా అరుణ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్, రాష్ట్ర నాయకులు డాక్టర్ నరేష్, ఎల్ నరేందర్‌రెడ్డి వి. కేశవరావు, జిల్లా అసెంబ్లీ కన్వీనర్ మణిభూషణ్ , డివిజన్ ఇన్‌చార్జి బుచ్చిరెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ హైదర్‌నగర్ డివిజన్‌ను రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతానన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతీనగర్ డివిజన్ పరిధిలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కార్పొరేటర్ సింధు రెడ్డి జలమండలి ఎండి అశోక్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని కాలనీలలో రూ.2కోట్ల నిధులతో డ్రైనేజీ పైపులైన్‌ల కోసం ప్రతిపాదనలు చేశారన్నారు. అందుకు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు. టీఆర్‌ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి పాల్గొన్నారు.

సామూహిక వ్రతాలు

ఫిలింనగర్: వైశాఖ పౌర్ణమి సందర్భంగా ఫిలింనగర్‌లోని దైవసన్నిధానం ఆలయంలో సోమవారం రమా సమేత సత్యనారాయణస్వామి వ్రతాలు ఘనంగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: బల్దియా పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని.. నిర్దేశించిన గడువులోపు పనులు పూర్తిచేసే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జీహెచ్ఎంసీ పరిధిలోని రామచంద్రాపురం, భారతినగర్, పటాన్‌చెరు డివిజన్‌ల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు డివిజన్‌ల పరిధిలో శంకుస్థాపన చేసిన పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. నిర్మాణ దశలో ఉన్న పనులపై అధికారులు రోజువారి తనిఖీలు చేపట్టాలన్నారు. నిధులకు సంబంధించిన ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో బల్దియా సర్కిల్-22 ఈఈ సురేష్, డీఈలు నరేందర్, దేవేందర్, ఏఈలు శివకుమార్, దివ్యతేజ పాల్గొన్నారు.

తాటిముంజలకు గిరాకీ

శేరిలింగంపల్లి: ఎండలు తాళలేక అల్లాడుతున్న ప్రజానీకానికి తాటిముంజలు చల్లదనాన్నిస్తున్నాయి. ఈ తాజా ముంజల కొనుగోలుకు ప్రజలు క్యూకడుతున్నారు. శేరిలింగంపల్లి హుడా ట్రేడ్ సెంటర్ కాలనీ వద్ద నల్లగండ్ల రైల్ ఓవర్ బ్రిడ్జికి వెళ్ళే ప్రధాన రోడ్డు పక్కన ముంజలు విక్రయిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు పరిసర ప్రాంతాల నుంచి రోజు ట్రావెల్స్ బస్సులలో తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. డజను రూ.100లకు విక్రయిస్తున్నారు.



అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి

మియాపూర్: అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మియాపూర్ గోపాల్‌రావునగర్ కాలనీలోని వాణిజ్య వ్యాపారషెడ్ల వద్ద దుర్వాసన వస్తుందని సోమవారం మధ్యాహ్నం మియాపూర్ పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా యువకుడు చనిపోయి రెండురోజులైనట్లు గుర్తించారు. చెట్ల మధ్యలో పడి ఉండడంతో ఎవరూ చూడలేకపోయారు. చుట్టుపక్కల ఆరా తీయగా గోపాల్‌రావునగర్ కాలనీలో ఉంటున్న లక్ష్మణ్ నాయక్ కుమారుడు వర్తే రామ్‌లాల్(25)గా గుర్తించారు. నాగర్‌కర్నూల్‌కు చెందిన రామ్‌లాల్ భార్య జాను, కుమారుడుఆదిత్య (3) , అక్షయ (9 నెలలు)లు మియాపూర్ గోపాల్‌రావునగర్ కాలనీలో గుడిసెలో ఉంటున్నారు. భార్య జాను హోటల్‌లో పనిచేస్తుండగా రామ్‌లాల్ స్థానికంగా కూలికి వెళ్తున్నాడు. గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో భార్య జానుతో రామ్‌లాల్ ఆరునెలల కిందట గొడవపడి దగ్గర్లో ఉన్న తండ్రి లక్ష్మణ్ నాయక్ ఇంట్లో ఉంటున్నాడు. ఈ నెల 10వ తేదీ రాత్రి రామ్‌లాల్ తండ్రి ఫోన్ తీసుకుని బయటకు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. మరుసటి రోజు తల్లిదండ్రులు కాల్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చిందని తెలిపారు. కాగా సోమవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో లక్ష్మణ్ నాయక్‌కు సమాచారం అందించగా అతను వచ్చి కుమారుడిని గుర్తించాడు. దీంతో మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రామ్ లాల్ మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

ఆరు నెలలుగా అదే గోస..!

- అల్లాపూర్ డివిజన్‌లో వేళాపాల లేకుండా నీటి సరఫరా
- అరకొరగా.. లోప్రెషర్‌లో వస్తున్న వైనం
- ఇబ్బందుల్లో ఆయా కాలనీలవాసులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ ప్రజలకు తాగునీటి తిప్పలు తప్పడం లేదు. 6 నెలలుగా వేళాపాల లేకుండా అది కూడా అరకొరగా నీటిని సరఫరా చేస్తున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాయత్రీనగర్, వివేకానందనగర్, పర్వత్‌నగర్, తులసీనగర్, అల్లాపూర్, జనప్రియనగర్ ప్రాంతాలకు బోరబండ రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా జరుగుతుంది. ఇక్కడ సుమారు 10 వేలకు పైగా కనెక్షన్లు ఉండడంతో రోజు విడిచి రోజు గంట సేపు నీటిని వదులుతారు. అది కూడా లో ప్రెషర్‌తో మొదలు కావడంతో కొంతమంది మోటార్లు బిగించడంతో తక్కువమందికి మాత్రమే తాగునీరు అందుతోంది. దీంతో కొందరు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి కాలాన్ని వెల్లదీస్తున్నారు. గాయత్రీనగర్ కాలనీలో గతంలో సాయంత్రం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు నీటి సరఫరా జరిగేది. కానీ గత డిసెంబర్ నుంచి రాత్రి 9 దాటాక ఏ అర్ధరాత్రో సరఫరా చేస్తున్నారు. అది కూడా సరైన సమయంలో సరఫరా కావడం లేదు.దీంతో తాగునీటి కోసం రాత్రంతా జాగరణ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అదేవిధంగా పర్వత్‌నగర్, వి. రామారావునగర్, గణేశ్‌నగర్, న్యూ రామారావునగర్, రాధాకృష్ణనగర్‌తో పాటు పలు బస్తీ, కాలనీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది. ఈ విషయమై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు వ్యక్తం చేస్తున్నారు. బయట నుంచి ట్యాంకర్లు కొనుగోలు చేయాలంటే రూ. 500 నుంచి రూ. 1000 చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటికైనా జలమండలి అధికారులు స్పందించి హై ప్రెషర్‌తో నీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



నీటి సమస్య పరిష్కరించాలని పర్వత్‌నగర్‌లో నిరసన తెలుపుతున్న మహిళలు

సరిపడా నీటిని సరఫరా చేయాలి..



కొన్ని నెలలుగా సరిపడా తాగునీరు సరఫరా కావడం లేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మరోవైపు వేళాపాల లేకుండా ఎప్పుడో అర్ధరాత్రి నీటిని వదులుతున్నారు. ఇప్పటికైనా జలమండలి అధికారులు స్పందించి ఒక సమయానికి సరిపడా నీటిని హైప్రెషర్‌లో సరఫరా అయ్యేలా చూడాలి.

–బి. జమున, పర్వత్‌నగర్

అధిక బిల్లును మాఫీ చేయాలి..



సాధారణంగా నీటి బిల్లు సుమారు రూ. 250 వస్తుండేది. కానీ ఒకేసారి సుమారు రూ. 19,977 బిల్లు వచ్చింది. గత ప్రభుత్వం 20 వేల లీటర్లను ఉచితంగా ఇచ్చింది. ఒకేసారి ఇంత బిల్లు వస్తే ఎలా కట్టాలి. ప్రభుత్వం, జలమండలి అధికారులు ఆలోచించి నీటి బిల్లును శాశ్వతంగా మాఫీ చేయాలి. అదేవిధంగా ఒకే సమయానికి హైప్రెషర్‌తో తాగునీరు సరఫరా అయ్యేలా శాశ్వత చర్యలు తీసుకోవాలి.

–ఎం రామతార, పర్వత్‌నగర్

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462